# 9

# సంఘర్షణ

*“విశ్వాస సంబంధమైన మంచి పోరాటము పోరాడుము, నిత్య జీవమును చేపట్టుము. దాని పొందుటకు నీవు పిలువబడి అనేక సాక్షుల యెదుట మంచి ఒప్పుకోలు ఒప్పుకొంటివి” (1 తిమోతి 6:12).*

క్రైస్తవ్యం అనేది కేవలం దేవునితో సమాధానం కలిగియుండడం అనే భావనతో ఆలోచించేవారికి, పోరాడమని పౌలు క్రైస్తవులకు యిచ్చే ఆజ్ఞ పరస్పర విరుద్ధంగా గోచరించవచ్చు. వాస్తవమేమంటే, ఈ లోకము ఎన్నడూ ఎరుగనంత గొప్ప పోరాటంతో క్రైస్తవ్యం కూడియుంది. అది తాను గుర్తించినా లేకపోయినా ఈ లోకంలోనికి జన్మించిన ప్రతి ఆత్మయు ఈ సంఘర్షణలో పాల్గొంటుంది, లోకాన్ని ప్రేమించేవారు దేవునికి శత్రువులై యుంటారు (యాకోబు 4:4). దేవునితో స్నేహంగా ఉండగోరేవారు లోకంతో పోరాటం కలిగియుంటారు (యోహాను 15:19). వెలుగునకు చీకటికి, దేవుడు సాతానులకు మధ్యనున్న సంఘర్షణలో మనమందరం పట్టబడతాం; మనం ఎవరి సైన్యంలో చేరతామో మనలో ప్రతి ఒక్కరు కోరుకోవలసి యుంటుంది.

1 తిమోతి 6:12లో, అది “మంచి పోరాటమని,” “విశ్వాసపు పోరాటమని” పౌలు వర్ణించాడు. నిజమైన క్రైస్తవ్యం పోరాటమే. “నిజమైన క్రైస్తవ్యమని” మనం మాట్లాడే దాన్ని క్వాలిఫై చేయాలి, ఎందుకంటే లోకంలో బాప్తిస్మమందు పాతిపెట్టబడి, ప్రతివారం సంఘ కార్యక్రమాలకు హాజరై, చనిపోయిన తరువాత పరలోకం వెళ్లాలనే తీక్షణమైన కోర్కె గలిగినవారు – దుష్ట శక్తులతో ఆత్మసంబంధమైన యుద్ధం జరిగించుతున్నట్టు ప్రతి ఫలించుతారు! క్రైస్తవ్య పోరాటమనే భావనలో తన్ను తాను ఉపేక్షించుకొనడం, క్రమ శిక్షణ, మరియు అనుదిన పోరాటం అనేవాటితో కూడియుంటుంది.

క్రైస్తవుని జీవితం విశ్రాంతిగానుండు, నులువెచ్చనగానుండు, పట్టీపట్టనట్టుండే తీరులో క్రీస్తు ప్రభువు ఎన్నడూ ఉద్దేశించలేదు. నిజ క్రైస్తవుడు దేవుని పరిచర్యలోనికి క్రీస్తు యేసుయొక్క మంచి సైనికునివలె పిలువబడ్డాడు. క్రైస్తవ రణరంగం – అపవాది, లోకము, మరియు శరీరమనే – ముగ్గురు శత్రువులతో కూడియుంది. అపవాది మన ఆత్మలకు సంబంధించిన పాతాళ సంబంధియగు విరోధి. లోకము బాహ్య శత్రువు, శరీరము అంతర్గత శత్రువు. మనం వ్యక్తిగతంగా జొరబడియున్న ఈ సంఘర్షణలో తీక్షణమైన ఆలోచనను నిలిపి ఈ శత్రువులలో ప్రతి ఒక్కని గుర్తించుదాం.

## పాతాళ సంబంధమైన శత్రువు

మనం ఎదుర్కొనే మొదటి శత్రువు భూమిక్రింద శత్రువు పాతాళ సంబంధి – అపవాదియే. సాతాను యొక్క (ఆరిజన్) ఆరంభాన్ని గూర్చి స్పష్టమైన వివరణను

బైబిలు ప్రసాదింపకపోయినా, అతడు పడిపోయిన దూత అనేదానికి బలమైన సూచన ఉంది. "పరలోకమందును భూమిమీదను, దృశ్యమైనవి గాని అదృశ్యమైనవిగాని ... సమస్తమును ప్రభువైన యేసు ద్వారా సృజింపబడ్డాయని లేఖనం తెలియజేస్తుంది" (కొలస్సీ. 1:16). సాతాను అదృశ్యమైన జీవి, గనుక వాడు ప్రభువుయొక్క అదృశ్యమైన సృష్టిలో భాగమై యుండాలి. దేవుడు సృజించిన యావత్తు మంచిదైనందున (ఆది. 1:31), సాతాను పాపము లేక దుష్టము లేకయే సృజింపబడియుండాలి.

"నీవు నియమింపబడిన దినము మొదలుకొని పాపము నీయందు కనబడు వరకు ప్రవర్తన విషయములో నీవు యథార్థవంతుడవుగా ఉంటివి" అని యెహెజ్కేలు వ్రాశాడు (యెహెజ్కేలు 28:15). యెహెజ్కేలు యొక్క ఈ మాటలు ప్రత్యేకించి తూరు రాజుకు ఉద్దేశింపబడిన సందేశమైనా (యెహెజ్కేలు 28:11), 28వ అధ్యాయంలోని కొన్ని వర్ణనలు భూరాజుకే ఏకంగా వర్తింపచేయబడేలా లేవు. "నీవు దేవుని తోటయైన ఏదెనులో నుంటివి" అని మనం 13వ వచనంలో చదువుతాం ... "అభిషేకింపబడిన కెరూబువై" (శక్తివంతమైన దేవదూత) ... అని 14వ వచనంలో ఉంది. తూరు రాజును అతని పాప భరితమైన లక్షణాలను సాతానుని యొక్క ఆది గర్వము పతనమునకు పోల్చబడుతున్నట్టు ఎక్కువమంది పండితులు తీర్మానించారు.

ఈలాటి వర్ణనే ప్రవక్తయైన యెషయా బబులోనురాజునకు ఉపయోగించాడు: "తేజోనక్షత్రామా, వేకువచుక్కా, నీవెట్లు ఆకాశమునుండి పడితివి ... నేను ఆకాశమున కెక్కి పోయెదను దేవుని నక్షత్రములకు పైగా నా సింహాసనమును హెచ్చింతును ... మేఘ మండలముమీది కెక్కెదను మహోన్నతునితో నన్ను సమానునిగా చేసికొందును అని నీవు మనస్సులో అనుకొంటివి గదా?" (యెషయా 14:12-14). అపవాది ఎంత చెడ్డవాడో ఈ యిద్దరు భూ రాజులు కూడా అంత చెడ్డవారై యున్నట్టు యెషయా, యెహెజ్కేలు అనే ప్రవక్తలు వర్ణించినట్టున్నారు.

దేవునికి విరోధంగా సాతాను తిరుగబడడంలో, తన పాపంలో పాలుపొందేలా దేవుని దూతలలో చాలమంది యితర దూతలను ప్రేరేపించినట్లున్నాడు. "దేవదూతలు పాపము చేసినప్పుడు దేవుడు వారిని విడిచిపెట్టక, పాతాళ లోకమందలి కటిక చీకటిగల బిలములోనికి త్రోసి, తీర్పుకు కావలిలో ఉంచబడుటకు వారిని అప్పగించెను" అని పేతురు వ్రాశాడు (2 పేతురు 2:4). గురుతులకు సంబంధించిన వర్ణనలో, "యెఱ్ఱని మహా ఘట సర్పము ... (సాతాను, ఎవని) తోక ఆకాశ నక్షత్రములలో మూడవ భాగము [దేవుని దూతలు] నీడ్చి వాటిని భూమిమీదికి పడవేసెను" (ప్రకటన 12:3, 4; వ్యాఖ్యానం నాది). సాతానును వాని అనుచరులును పరలోకమునుండి భూమిమీదికి పడవేయాలి, ఇప్పుడు వారి యుద్ధము ప్రభువైన యేసు యొక్క పెండ్లి కుమార్తె, అనగా మన ప్రభువు సంఘానికి విరోధంగా సాగుతోంది. "అందుచేత ఆ ఘటసర్పము ఆగ్రహము తెచ్చుకొని, దేవుని ఆజ్ఞలు గైకొనుచు యేసునుగూర్చి సాక్ష్యమిచ్చుచు ఉన్న వారైన ఆమె సంతానములో శేషించినవారితో యుద్ధము చేయుటకై బయలువెడలి సముద్రతీరమున నిలిచెను" (ప్రకటన 12:17).

"దేవుని ఆజ్ఞలు గైకొనువారు" మరియు ప్రభువైన యేసునందు విశ్వాసముంచువారు

అపవాదితోను దురాత్మలతోను యుద్ధము చేస్తున్నట్టు యోహాను ప్రకటించాడు. ఎఫెసీ. 6:12లో పౌలు సూచించే అపవాదితో యుద్ధం యిదే: "ఏలయనగా మనము పోరాడునది శరీరులతో కాదు, గాని ప్రధానులతోను అధికారులతోను, ప్రస్తుత అంధకారసంబంధులగు లోకనాథులతోను, ఆకాశమండలమందున్న దురాత్మల సమూహములతోను పోరాడుచున్నాము."

అపవాది క్రియలయొక్క రుజువు ప్రతిచోట ఉంది. లోకమంతటిలో దేశాలు యుద్ధాలు చేసికొంటున్నాయి. రోడ్లు మీద జనులు ఒకరినొకరు కాల్చి చంపుకొంటున్నారు. బిల్డింగ్స్‌కు బాంబులు వేస్తున్నారు, కుటుంబాలు విడిపోతున్నాయి, పిల్లలు నాశనమగుతున్నారు. మన లోకంలోనికి అదృశ్యమైన ఆత్మసంబంధమైన నాశనాన్ని సాతాను దృశ్యమైన రూపంలో నేడు కక్కి వేస్తున్నాడు!

## బాహ్య శత్రువు

క్రైస్తవులు పోరాడే రెండవ శత్రువు లోకం. 1 యోహాను 2:15, 16ల్లో యోహాను యిలా హెచ్చరించాడు. "ఈ లోకమునైనను లోకములో ఉన్నవాటినైనను ప్రేమింపకుడి. ఎవడైనను లోకమును ప్రేమించినయెడల తండ్రి ప్రేమ వానిలోనుండదు. లోకములో ఉన్నదంతయు, అనగా శరీరాశయు నేత్రాశయు జీవపుడంబమును తండ్రివలన పుట్టి నవి కావు; అవి లోకసంబంధమైనవే."

ఈ లేఖన భాగంలో లోకమని యోహాను అంటుంది, కాలారంభమందు దేవుడు సృజించిన మంచిలోకాన్ని గూర్చి కాదు, కాని సాతాను సమకూర్చిన దుష్టత్వానికి సంబంధించిన లోకాన్ని గూర్చి. ఈ యుగ సంబంధమైన దేవత అవిశ్వాసులైన వారి మనో నేత్రాలకు గ్రుడ్డితనం కలిగించుతున్న సంగతిని తెలియజేసినప్పుడు పౌలు సాతానును గూర్చి మాట్లాడాడు (2 కొరింథీ. 4:4). ఆరోగ్యం, ఆస్తి, సంతోషమనే తప్పుడు వాగ్దానాలతో మనుష్యుల మనస్సులకు గ్రుడ్డితనం కలుగజేయడంతో, వారి ప్రభువు, దేవుడు తానేయన్నట్టు లోకులు వానికి తమ్మును తాము లోబరచుకొన్నారు. ఈ భయంకరమైన పరిస్థితికి ఫలితం, అపవాది అంధకార సంబంధమైన తన రాజ్యాన్ని స్థాపించుకొని, మానవ సమాజానికి వెనుకనున్న దుష్టత్వానికి కర్తయై నిలిచాడు.

జనులు సాతాను మాటలను తమ హృదయాలతో నమ్మి విధేయులైనప్పుడు, దేవునినుండి వారు తమ స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నారు. దేవుడు లేకుండ, మానవ జ్ఞానాన్నే ఆధారం చేసికొని నరుడు తన సొంత సన్మార్గ సూత్రాలను ఏర్పరచుకొన పూనుకొంటాడు. దేవుడు లేకున్న నరుడు, జీవితంలోనుండి ఆత్మసంబంధ విలువలను దాచుకొన్నవాడై, జీవితపు భావాన్ని, "శరీరాశ, నేత్రాశ, జీవపు డంబాలకు" లోను చేస్తాడు (1 యోహాను 2:16).

"శరీరాశ" శరీర వాంఛలను తీర్చుకొనడంలో మునిగిపోతుంది. "శరీరాశ" కొరకు జీవించేవారు, భౌతికమైన సంపాదనలమీదను, మాంసయుక్తమైన ఆకలిమీదను తమ దృష్టని కేంద్రీకరిస్తారు. వారు ఎంత స్వార్థంగాను వ్యక్తి కేంద్రంగా చేసికొంటా రంటే, వారు ఆనందించగల భౌతికమైన ప్రతివిధమైన సుఖాన్ని సాధ్యమైనంతవరకు

అనుభవించడానికే తమ్మును తాము అప్పగించుకుంటారు. తమకు ఏమి మేలుగా ఉంటుందో దానినే వెంటాడడానికి జాతీయ, వ్యాపార, మత సంబంధమైన నాయకులను శరీరాశ తోలుతుంది. నిజంగా, లోకంలోని బాధలకు, విశ్రమము లేమికి కారణం "శరీరాశ" కారణంగా మనం కనుగొనవచ్చు.

"నేత్రాశ" అనేది లోక విధానంలో రెండవ గుణ లక్షణమైయుంది. దేవుడు తనకు ప్రసాదించిన కండ్లను నరుడు ఆశీర్వాదమునకు సాధనములుగా గాని, లేక గొప్ప చెడుకు గాని వినియోగించుకోవచ్చు. ఉదాహరణకు, దేవుని సృష్టి సౌందర్యాన్ని తిలకించి, దానిచే ఆయనకు స్తుతిగానం చేసేదానికి సాధనములుగా వాడుకోవచ్చు. మన కన్నులతో దేవుని వాక్యాన్ని పఠించి దాన్ని ధ్యానించుతూ, దేవుని పిల్లలకొరకు పరలోకంలో పొందబోయే ఘనమైన ప్రభువుయొక్క పరిశుద్ధమైన వాటిమీద లక్ష్యాన్ని నిలుపుకొంటూ ఉండవచ్చు. అపవాదియు వాని పరిచారకులును, మన కండ్లకు అపవిత్రమైన, లైంగిక సంబంధమైన మోహానికి, నీచమైన దృశ్యాలను, పుస్తకాలను చూచేలా, ఆకర్షణలను కలిగించజూస్తారు. ఈలాటివి, సాతాను యొక్క దుష్టలోకానికి సంబంధించినవని యోహాను హెచ్చరించాడు.

"జీవపు డంబము" అనేది దుష్టలోకానికి సంబంధించిన మూడవ లక్షణమైయుంది. ఇతరుల యొద్దనుండి ఘనతయు, గుర్తింపును పొందాలని స్త్రీ పురుషులు తంటాలు పడ తారు. తమకొరకు పేరు సంపాదించుకొనడానికి గాను, అధికమైన ధనాన్ని జనులు తమ యిండ్లమీదను భూములమీదను దారబోస్తారు. తమ ఆస్తియొక్క గొప్ప విలువలమీద తమ విజయాన్ని గర్వంగా కొలుచుకుంటారు. తమ మానసిక సామర్థ్యాలను ప్రదర్శించ డానికి పండితులు విద్యా సంబంధమైన డిగ్రీలు సంపాదించుకొంటారు. క్రీడా రంగంలో గుర్తింపును మన్ననలను పొందగోరి క్రీడాకారులు తాము చేయగలిగినదంతా చేస్తారు. అధికారం, గౌరవం, ఘనత పొందడమే నేడు దాదాపు ప్రయాసపడే ప్రతి మానవ హృదయంలో ఉంది.

సంగ్రహంగా, మన ప్రపంచంయొక్క ప్రాథమిక సాంఘీక నిర్మాణం శరీర సంబంధ మైన, పదార్థ సంబంధమైన విలువలతో కూడినదై దేవునికి పూర్తిగా అన్యమైనదిగా ఉన్నట్టు దేవుని వాక్యము బోధిస్తుంది. ఆయననుండియు, ఆయనతో సన్నిహితమైన బాంధవ్యం నుండియు లౌకిక ప్రాధాన్యతలు జనులను బహు దూరంగా కొనిపోతాయి. జనులను పాప కూపములోనికిని, వాని రాజ్యం యొక్క ఆత్మసంబంధమైన అంధకారంలోనికిని జనులను మోసగించి కొనిపోడానికి అపవాదియు వాని దురాత్మల సమూహమును ఈ పద్ధతులను ఉపయోగించుకొంటాయి.

లోకసంబంధమైన ప్రాధాన్యతలమీద దృష్టి నిలిపే సహోదరులను యాకోబు "వ్యభిచారిణులారా" అని పిలిచాడు. "ఈ లోకస్నేహము దేవునికి వైరమని" అతడు హెచ్చరించాడు, మరియు "ఎవడైనను లోకమును స్నేహింప గోరినయెడల వాడు దేవుని శత్రువు" అని ప్రకటించాడు (యాకోబు 4:4). ప్రభువైన యేసుమీద కాక, లోకంమీద ఒక క్రైస్తవుడు దృష్టి నిలిపినప్పుడు, మన నిత్య పెండ్లి కుమారుడైన క్రీస్తుకు వ్యతిరేకంగా అతడు వ్యభిచారము చేసినవాడైయుంటాడు.

# అంతరంగ (అంతర్గత) శత్రువు

క్రైస్తవుడు ఎదుర్కొనే మూడవ శత్రువు, అంతరంగ శత్రువు, శరీరం. క్రొత్త నిబంధనలో "శరీరము" అనే పదము పలు అర్థాలతో ఉపయోగింపబడింది. కొన్నిసార్లు మన దేహంలోని మాంసయుక్తమైన భాగాన్ని సూచిస్తుంది, లూకా 24:39లో వలె, అక్కడ ప్రభువు యిలా అన్నారు. "నేనే ఆయనను అనుటకు నా చేతులను నా పాదములను చూడుడి; నన్ను పట్టి చూడుడి, నా కున్నట్టుగా మీరు చూచుచున్న యెముకలును మాంసమును భూతమున కుండవు." కొన్నిసార్లు శరీరమనే పదం బైబిల్లో అపో. 2:26లో వలె, పూర్ణమైన వ్యక్తిని సూచించడానికి ఉపయోగించబడింది. అక్కడ పేతురు కీర్తన రచయితను కోట్ చేస్తూ యిలా అన్నాడు, "... మరియు నా శరీరము కూడ నిరీక్షణ గలిగి నిలకడగా ఉండును." మూడవ భావంలో "శరీరము" (మాంసం) అనేది పతనమైన మానవ స్వభావాన్ని సూచించడానికి వినియోగింపబడింది.

ఆదాము హవ్వలు తొలిగా సృజింపబడినప్పుడు, వారు దేవునితో ఆత్మసంబంధమైన బాంధవ్యం కలిగియున్నారు, శరీర, ప్రాణ, ఆత్మలు అన్నీ క్షేమకరంగా ఉన్నాయి. ఏదియెలాగున్నా, వారు పాపము చేసినప్పుడు, వారి ప్రాణాలు, బాహ్య పురుషుని లేక శరీరం యొక్క డిమాండ్స్‌కు లోబరచబడ్డాయి. దానివలన కలిగిన భయంకరమైన ఫలితమేమంటే, దేవునియొక్క ఆత్మ నియమంనుండి, వారి శరీరం యొక్క స్వాధీనంలో వారు పడిపోయారు. ఆ సమయమందు మానవ పాప స్వభావం దేవునినుండి వేరు చేయబడింది, "మాంసయుక్తమైనట్టు" పిలువబడింది. నేడు శరీర సంబంధమైనదంటే, తాత్కాలికమైన దేహం యొక్క అపేక్షలకొరకు మనిషిమీద తన ప్రాబల్యాన్ని కనుపరచేదే గాని, నిత్యుడగు ఆత్మ అదుపులో ఉండేది కాదు!

శరీరాత్మలు ఒకదానికొకటి విరోధంగా అపేక్షిస్తాయన్న విషయాన్ని గలతీ. 5లో పౌలు ప్రకటించాడు: "శరీరము **ఆత్మ**కును **ఆత్మ** శరీరమునకును విరోధముగా అపేక్షించును. ఇవి యొకదానికొకటి వ్యతిరేకముగా ఉన్నవి గనుక మీరేవి చేయ నిచ్ఛయింతురో వాటిని చేయకుందురు" (17 వ.). "శరీరమునకును" "ఆత్మకును" మధ్య అంతర్ యుద్ధం నిరంతరం కొనసాగుతుంది. రోమా 7లో శరీరముయొక్క శక్తిని గూర్చి పౌలు వర్ణించాడు. తన జీవితాన్ని సంపూర్ణంగా సమర్పించిన గొప్ప వ్యక్తిగా మనం పౌలును భావిస్తాం, అయినా రోమా 7:18లో అతడు యిలా వ్రాశాడు, "నాయందు, అనగా నా శరీరమందు మంచిది ఏదియు నివసింపదని నేనెరుగుదును." తన దేహంలో జరుగుతున్న (సివిల్ వార్) అంతర్ యుద్ధాన్ని గూర్చి అతడు వివరించుకుంటూ వెళ్లాడు. మొత్తానికి పౌలు చెప్పేదేమంటే, "దేనికంటెను ఎక్కువగా ప్రభువైన యేసుకొరకు నేను జీవించాలని నా హృదయం ఒప్పింపబడింది, కాని నాకొక సమస్య ఉంది! నేను ఎంత తీవ్రంగా దేవుని చిత్తాన్ని జరిగించాలని పట్టుదల కలిగియున్నా, నా జీవితంలో ఆయన చిత్తానికి తప్పిపోతున్నట్టే కన్పిస్తున్నాను. నేను చేయదలచుకొన్న సంగతులు కొన్నిసార్లు చేయలేకపోతున్నాను; చేయకూడదని నేను ఉద్దేశించే వాటిని కొన్నిసార్లు

చేస్తున్నాను!" భయంకరమైన ఈ సందిగ్ధంలో పౌలు పడియుండి, కలతతోను హృదయ వ్యాకులతతోను అతడు యిలా విలపించాడు, "అయ్యో, నేనెంత దౌర్భాగ్యుడను? ఇట్టి మరణమునకు లోనగు శరీరమునుండి నన్నెవడు విడిపించును? మన ప్రభువైన యేసుక్రీస్తుద్వారా దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను ..." (రోమా 7:24, 25).

తమ జీవితాలమీద భౌతికమైన దేహంయొక్క స్వాధీనంలో ఉంచుకొనగోరువారు "శరీర సంబంధులైయుంటారు." శరీర స్వభావమునసరించి నడుచుకునే వారు మారుమనస్సు పొందకుండ దేవుని ఆనందింపజేయలేరు. శరీరం యొక్క ఆధీనంలో నడిచేవారికి భిన్నంగా, ఆత్మ తమ జీవితాలను స్వాధీనపరచుకోవాలనే అపేక్షను కనుపరచే ఉన్నారు. కేవలం ప్రభువైన యేసు ద్వారా – ఆయనయందలి పాప క్షమాపణ మరియు అంతరంగ బలముద్వారా మాత్రమే – తన జీవితాన్ని ఒకడు "శరీరానికి" గాక "ఆత్మకు" లోబరచగలుగుతాడు! మనం జీవించగల రెండింటిలో ఏదో ఒక దానికి మనం తీర్మానించుకోవాలి. దేవుని కుమారునియందలి విశ్వాసంవలన మనం జీవింపవచ్చు, లేదా ఆత్మ నియమంలో మనం సాగిపోవచ్చు. జనులలో అధిక సంఖ్యాకులు సులభమైన మార్గాన్ని కోరుకొని శరీరాన్ని అనుసరించి బ్రదుకుతున్నారు. దానికి భిన్నంగా, విశ్వాసంవలన జీవించేవారు, తమ అహంనుండి వారి హృదయాలను లాగివేసి, ప్రభువైన యేసునందు కేంద్రీకరించారు. వీరిని గూర్చి పౌలు యిలా ప్రకటించాడు, "దేవుని ఆత్మ మీలో నివసించియున్నయెడల మీరు ఆత్మ స్వభావము గలవారేగాని శరీర స్వభావము గలవారు కారు ..." (రోమా 8:9).

ప్రభువైన యేసుక్రీస్తు సువార్తను గూర్చిన ఒక ప్రాథమికమైన వాస్తవాన్ని మనమందరం గ్రహించాలి. శరీరాన్ని వృద్ధి చేయడానికి ప్రభువు ఈ లోకానికి రానేలేదు; ఆయన దాన్ని స్థాన భ్రంశం చేయడానికి వచ్చారు! మన పాపం పక్షంగా ఆయన కల్వరిలో మరణించడం మాత్రమే గాక, మన జీవానికి ప్రతిగా ఆత్మద్వారా మనలో జీవించడానికి ఆయన అవతరించారు! మనం "సువార్తకు లోబడినప్పుడు" (2 థెస్స. 1:8), మారుమనస్సు, బాప్తిస్మముల ద్వారా, మనం మన పాపములకు క్షమాపణ పొందినవారమై పరిశుద్ధాత్మ అను వరమును పొందుతాం (అపొ. 2:38; 5:32). "పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగంగా మన శరీరాలను సమర్పించినప్పుడు" (రోమా 12:1), ప్రభువైన యేసు తానే మనలో నివసిస్తాడు (1 కొరింథీ. 12:27). వ్యక్తిగతమైన అనుభవంతో పౌలు యిలా ప్రకటించాడు: "... ఇకను జీవించువాడను నేను కాను, క్రీస్తే నాయందు జీవించుచున్నాడు. నేనిప్పుడు శరీరమందు జీవించుచున్న జీవితము నన్ను ప్రేమించి, నా కొరకు తన్ను తాను అప్పగించుకొనిన దేవుని కుమారునియందలి విశ్వాసమువలన జీవించుచున్నాను" (గలతీ. 2:20). జయజీవితాన్ని జీవించడానికి ఏకైక మార్గం దేవుని కుమారునియందలి విశ్వాసంవలన జీవించడమే. "కాబట్టి యిప్పుడు శరీరమునసరింపక ఆత్మననుసరించియే నడుచుకొనువారికి, క్రీస్తుయేసునందున్న వారికి ఏ శిక్షా విధియు లేదు" (రోమా 8:1; NKJV[1] తర్జుమా రూపం).

## ముగింపు

నేడు ఎక్కువమంది ప్రజలు దేవునితో పోరాడుతున్నారు, మరియు సంఘ సభ్యులని చెప్పుకునే కొందరి విషయంలో దుఃఖకరంగా యిది సత్యం! శరీరము యొక్క శక్తివలన నీవు అహం కేంద్రంగా ఉన్న జీవితాన్ని జీవించుతున్నట్టయితే, నీవు ఈ లోక వ్యవహారాలకొరకు జీవిస్తున్నట్టయితే, నీ ఆత్మ ఆపదలో ఉంది! నీవు దేవునితో యుద్ధం జరిగిస్తున్నావు, నీ పాపముల విషయమై మారుమనస్సు పొంది, ఆయనతో నీ హృదయం సరిపడవలసియుంది. లోక సంబంధమైన జీవితం జీవిస్తున్న ప్రభువైన యేసుమీద గాక, శరీరంమీదనే దృష్టి నిలిపిన దేవుని బిడ్డవైతే, నీవు నీ పాపమును ఒప్పుకొని, నీ మొదటి ప్రేమకు పునరుద్ధరించబడు. నీవు సువార్తకు ఎన్నడూ లోబడక ఉన్నట్టయితే, నీ పాపక్షమాపణ కొరకు క్రీస్తు మరణంలో పాలుపొందడానికి గాను నీ మారుమనస్సుతో బాప్తిస్మం వెంబడించాలి (రోమా 6:3, 4).

---

సూచన

[1]New King James Version.